

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 20-11-2022 సంపుటి : 04 సంచిక :80 పేజీలు : 4 వెల : రూ 3-00

## ఏపీలో రోడ్డు ప్రమాదం..

### వరంగల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ దంపతుల మృతి

కనగానపల్లె: శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లె మండలం పర్వతదేవరపల్లిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ముగ్గురు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు రమ్య, గోపీనాథ్, వారి పిల్లలు సాహిత్, హాసిని, మరో బంధువుతో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు కారులో వస్తున్నారు. పర్వతదేవరపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి కారు కల్వర్ట్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రమ్య, గోపీనాథ్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.వారి బంధువు తారకేశ్వరి, చిన్నారులు సాహిత్, హాసిని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తారకేశ్వరి(62) మృతి చెందారు. చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

## చంద్రబాబుది అసమర్ధుని అంతిమ యాత్ర: స్పీకర్ తమ్మినేని

విశాఖపట్నం: చంద్రబాబు అధికారం కోసం ఎంతకయినా దిగజారుతారని స్పీకర్ తమ్మినేని సీతారాం మండిపడ్డారు. చంద్రబాబుకు ఇప్పటికే నిరాశ నిస్పృహలు ఆవహించాయన్నారు.ఎన్నికల సమయానికి ఎన్నో కుయుక్తులు పన్నుతారని చెప్పారు. చంద్రబాబును దగ్గరనుంచి చూసిన వ్యక్తిగా ఆయనకు ఎంత అధికార దాహమో తనకు తెలుసన్నారు. తనకంటే చిన్నకుర్రాడైన జగన్ గురించి తక్కువగా భావించి ఇప్పుడు తట్టుకోలేక పోతున్నారని అన్నారు.'వైఎస్ జగన్ ఆలోచన విచక్షణ ముందు నిలబడలేకపోతున్నానని చంద్రబాబు కృశించిపోతున్నారు. ప్రధాని ఎదుట కూడా సీఎం జగన్ రాజకీయాలకంటే రాష్ట్రం ముఖ్యమని చెప్పారు. వికేంద్రీకరణకు మద్దతుగా రాయలసీమ ప్రజలు చంద్రబాబుని ఛీ కొట్టారు. దత్తపుత్రుడు పవన్ చెప్పు చూపిస్తే.. చంద్రబాబు కూడా చూపిస్తా అన్నారు. చరిత్రపుటల్లో ఇలాంటి ఎంతో మంది కొట్టుకుపోయారు. అధికారమనే మానసిక రోగంతో చంద్రబాబు పతనమైపోతున్నారు. జగన్‌కు లక్ష్యంపై క్లారిటీ ఉంది. చంద్రబాబు కర్నూలు పర్యటనలో అంతు చూస్తా అన్నారు. ఆయన ఎవరి అంతు చూస్తారని' ప్రశ్నించారు.చంద్రబాబు మీ పార్టీ అంపశయ్యపై ఉంది. వెంటిలేటర్లు తీస్తే అంతిమ యాత్రే. ఇది అసమర్ధుని అంతిమ యాత్ర. మీ పార్టీకి ఇది ఆఖరు రోజులు. 600 వాగ్దానాలు చేశారు. ప్రశ్నిస్తే వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టో తీసేశారు అని స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యాఖ్యానించారు.



# వచ్చే ఎన్నికల్లో తెదేపా ఓడితే..

# రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరు: చంద్రబాబు







మంగళగిరి: ఇంతటి దారుణమైన.. నీచమైన ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని.. గత మూడున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ఎంతో విధ్వంసం జరిగిందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు.మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తెదేపా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఇందులో భాగంగా 'ఇదేం ఖర్మ' పేరిట కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఎన్నో దారుణాలు జరిగాయన్నారు. ఈ దారుణాలన్నీ పోలీసుల సహకారంతో ప్రభుత్వమే చేసిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ప్రతిపక్షంలో ఉన్నా అంతే బాధ్యతగా ఉన్నామని చంద్రబాబు తెలిపారు."అధికార పార్టీకి చెందిన ఓ ఫ్లెక్సీ తగులబడితే పోలీసులను రంగంలోకి దింపారు. తునిలో తెదేపా నేత మీద హత్యాయత్నం జరిగితే ఆ పోలీసులు ఎక్కడున్నారు? నాపై పూలేస్తే ఆ పూలల్లో రాళ్లున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఇవాళ పూలల్లో రాళ్లున్నాయన్నారు.. రేపు అవే పూలల్లో బాంబు ఉందని అంటారా? నాపై రాళ్లేస్తే భయపడి పర్యటనలు మానుకుంటానని అనుకుంటున్నారా? అచ్చెన్నాయుడిని వేధించడంతో ప్రభుత్వం దారుణాలకు తెర లేపింది. ఎంపీ రఘురామకృష్ణరాజును పోలీస్ కస్టడీలో ఉండగానే చంపే ప్రయత్నం చేశారు. కోర్టులు తప్పు పట్టినా ప్రభుత్వం భయపడటం లేదు. ఇవాళే కాదు.. రేపు అనేది కూడా ఉంటుందని పోలీసులు గుర్తుంచుకోవాలి. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతాం. ప్రతి సందర్భంలోనూ ప్రజలను.. ప్రతిపక్షాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతోందని ప్రజలు గుర్తించారు. 3 రాజధానులు వద్దు.. ఒకే రాజధాని కావాలని ఆదోని, ఎమ్మిగనూరు ప్రజలు ముక్తకంఠంతో నినదించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

దౌర్జన్యాలు చేసిన వాళ్లపై తిరగబడితేనే దారికొస్తారు..

"దౌర్జన్యాలు చేసిన వాళ్లపై ప్రజలు తిరగబడితేనే దారికొస్తారు. అధికార పార్టీకి చెందిన ప్రతీ ఎమ్మెల్యే.. సీఎం జగన్ తరహాలోనే దోచుకుంటున్నారు. ప్రజలు, వ్యాపారులను భయపెట్టి వారి ఆస్తులను అధికార పార్టీ ఎమ్మెల్యేలు రాయించుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ఓడితే.. రాష్ట్రాన్ని ఎవరూ కాపాడలేరు. తెదేపా గెలుపు నా కోసమో.. పార్టీ నేతల కోసమో కాదు. రాష్ట్రాభివృద్ధి కోసమని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రం కోసం నా ప్రాణాలైనా ఇస్తాను కానీ.. వెనక్కి వెళ్లను" అని చంద్రబాబు అన్నారు.



## సంక్షేమ సామ్రాట్ సీఎం జగన్: ఆర్‌కే రోజా

తిరుపతి: కుల, మతాలకు అతీతంగా అందరికీ సంక్షేమం అందిస్తున్న నేత సీఎం వైఎస్ జగన్ అని మంత్రి రోజా కొనియాడారు. జగనన్న సంక్షేమ సామ్రాట్ అని రోజా ప్రశంసించారు.తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక వేడుకలకు హాజరైన రోజా.. మాట్లాడారు.వచ్చే నెలలో జగనన్న పుట్టినరోజుని పురస్కరించుకుని స్వర్ణోత్సవ వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు రోజా తెలిపారు. ఈ రోజు నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్లు రోజా తెలిపారు. రాయలసీమలో జోన్‌ల వారీగా 19, 20,21వ తేదీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కళాకారుల డేటా సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రోజాతో పాటు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తదితరులు హాజరయ్యారు.



## 'రామోజీరావు తెలివితేటలకు పద్మవిభూషణ్ కాదు.. భారతరత్న ఇవ్వాలి'

రాజమండ్రి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కేసు విషయంపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ మరోసారి కీలక



వ్యాఖ్యలు చేశారు. అరుణ్ కుమార్ శనివారం మీడియాతో మాట్లాడుతూ..'డిసెంబర్ 2న మార్గదర్శి కేసు విచారణ ఉంది. డిపాజిట్ల సేకరణ ఆపేసినట్లు 2006లో రామోజీరావు చెప్పారు. డిపాజిట్లను తిరిగి చెల్లిస్తామని హైకోర్టు, సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేశారు. కానీ, ఇప్పటికీ డిపాజిట్లు వసూలు చేస్తూనే ఉన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్ పేరు మీదే డబ్బు సేకరిస్తున్నారు.గతంలో డిపాజిట్ అని ఉండేది.. ఇప్పుడు రిసీట్ అని సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి ఔట్ స్టాండింగ్ రూ. 139 కోట్లుగా చూపించారు. మార్గదర్శికి 3 శాతం కూడా డీఫాల్టర్లు లేరు.. అందులో కిటుకు ఏంటి?. రామోజీకి బ్యాంకులను అప్పగిస్తే అద్భుతంగా నడిపిస్తారేమో. రామోజీ తెలివితేటలకు పద్మవిభూషణ్ కాదు.. భారతరత్న ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ధైర్యంగా మార్గదర్శిలో తనిఖీలు నిర్వహించింది. మార్గదర్శికి ఇవాల్టికీ రామోజీనే ఛైర్మన్.. కానీ, కోర్టులో మాత్రం ఆయన ఛైర్మన్ కాదంటున్నారు.రామోజీకి రెండు టోపీలు ఉన్నాయని సుప్రీంకోర్టు జడ్జీ చెప్పారు. రామోజీ టోపీల్లో ఒకటి మీడియా, రెండోది ఇండస్ట్రీయలిస్ట్. వ్యాపారవేత్తగా చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మీడియాను వాడుకుంటున్నారు. ఏ వ్యాపారమైనా చట్టానికి లోబడే చేయాల్సిందే. రామోజీ చట్టాన్ని ఉల్లంఘించినట్టు రికార్డులే చెబుతున్నాయి. మార్గదర్శి స్కామ్‌పై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలి' అని డిమాండ్ చేశారు.

## కేరళలో ఏపీ శబరిమల భక్తుల వాహనం బోల్తా..

### ప్రమాదంపై సీఎం జగన్ ఆరా

తాడేపల్లి: కేరళలో ఏపీకి చెందిన శబరిమల భక్తులు ప్రయాణిస్తున్న వాహనం ఒకటి శనివారం ఘోర ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఏలూరుకు చెందిన 18 మంది భక్తులకు గాయాలు అయ్యాయి.వీరిలో చిన్నారి సహా ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను కొట్టాయం మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు అక్కడి అధికారులు.శబరిమల దర్శనం ముగించుకుని వస్తుండగా ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. పత్తనంథిట్ట జిల్లా లాహల్యాంప్ బోటు ప్రాంతంలో ప్రమాదం జరిగింది. మొత్తం మూడు బస్సుల్లో శబరిమలకు వెళ్లారు భక్తులు. దర్శనం ముగించుకున్న వస్తుండగా.. ఘాట్ రోడ్డు దగ్గర వాహనం స్టీరింగ్ పట్టేయడంతో వెనక్కి వచ్చి బోల్తాపడింది. ప్రమాదానికి గురైన బస్సులో 44 మంది భక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను ఏలూరు మండలం మాదేపల్లి ప్రాంతానికి చెందిన స్వాములుగా గుర్తించారు అధికారులు. ఈ ఘటనపై అక్కడి జిల్లా కలెక్టర్, అధికారులతో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఫోన్‌లో మాట్లాడారు.

సీఎం జగన్ ఆరా..

కేరళలో ఏపీకి చెందిన అయ్యప్ప భక్తులు ప్రమాదానికి గురికావడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదంపై సీఎం జగన్ ఆరా తీశారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు.





## మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి మరో ముందడుగు

విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో తీర ప్రాంత అభివృద్ధిలో మరో అడుగు ముందుకు పడింది. ఇటీవలే మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి ఏపీ హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే.దీంతో.. మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం వేగం పెంచింది.తాజాగా మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి రూ. 3, 940 కోట్లు మంజూరు అయ్యింది. దీంతో పోర్టు వ్యయానికి అవసరమయ్యే వంద శాతం రుణం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మంజూరు చేసినట్లయ్యింది.ఈ మేరకు ఏపీ ప్రభుత్వానికి మంజూరు ఉత్తర్వులు పంపింది పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్. దీంతో అతి త్వరలోనే మచిలీపట్నం పోర్టుకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు.



# సంపాదకీయం

ఆదివారం 20-11-2022

## అమెరికా, చైనాల తర్వాత భారత్

భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మొదటి సారిగా ఒక ప్రైవేటు రాకెట్ ప్రయోగం జరగడం చెప్పుకోదగిన పరిణామం. అంతరిక్షంలోకి తొలి ప్రయివేటు రాకెట్ విజయవంతంగా ముగిసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి కొద్దిసేపటి క్రితం చేసినప్రయోగం విజయవంతం అయిందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ రాకెట్ ను హైదరాబాద్ కు చెందిన స్కై రూట్ ఏరోస్పేస్ సంస్థ రూపొందించింది. తొలి సారి ప్రయివేటు రంగానికి చెందిన రాకెట్ ను ఇస్రో ప్రయోగించింది. ఈ ప్రయివేటు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. దేశంలో తొలిసారి ప్రయివేటు రంగంలో రూపొందించిన మొదటి రాకెట్ విక్రమ్ ఎస్ ను విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ ప్రారంభ్ విజయవంతమయిందని ప్రకటించడంతో సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంతోషం వ్యక్తమయింది. ఈ రాకెట్ బరువు 545 కేజీలు. ఆరు మీటర్ల ఎత్తు ఉంది. ప్రయోగం సక్సెస్ కావడంతో ప్రయివేటు పరంగా మరిన్ని ప్రయోగాలకు సిద్ధమవుతున్నట్లే అనుకోవాలి.ప్రపంచ అంతరిక్ష మార్కెట్లో భారత దేశం వాటా కేవలం 2 శాతమే. ప్రైవేటైజేషన్ ద్వారా ఇది బాగా పెరుగుతుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఈ రంగంలో అమెరికా, చైనాలదే పైచేయిగా వుంది. అంతర్జాతీయ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో కనీసం 810 శాతం వాటాను భారత్ కైవసం చేసుకోగలదని పవన్ కుమార్ గోయెంకా అభిప్రాయపడ్డారు. ఇస్రోకు ప్రైవేటు సంస్థలకు మధ్య సమన్వయ సహకారాలు సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ఇన్ స్పేస్‌ను నెలకొల్పింది. ప్రస్తుతం భారత అంతరిక్ష రంగం విలువ 7 బిలియన్ కోట్ల డాలర్లు కాగా, 2024 నాటికి ఇది 50 బిలియన్ డాలర్లకు చేరుకొంటుందని ఆశిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రైవేటు అంతరిక్ష సంస్థలకు, అంతరిక్ష ప్రయాణానికి మంచి రోజులు వచ్చాయని చెప్పవచ్చుఅంతరిక్ష శోధన, సాధన రంగాన్ని ప్రధాని మోడీ ప్రభుత్వం 2020లో ప్రైవేటుకు బార్లా తెరిచింది. ఆ తర్వాత రెండేళకే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్ స్పేస్ సంస్థ రూపొందించిన చిన్న సైజు రాకెట్ విజయవంతంగా అంతరిక్షంలో ప్రవేశించడం విశేష పరిణామమే. అంతరిక్ష రంగంలోకి ప్రైవేటు అడుగు పెట్టడం ఇదే తొలిసారి కాబట్టి ఈ ప్రాజెక్టుకు ప్రారంభ్ అని పేరు పెట్టారు.ఇస్రో వ్యవస్థాపకుడు విక్రమ్ సారాభాయ్ పేరిట నామకరణం చేసిన విక్రమ్ ఎస్ అనే 6 మీటర్ల నిడివి ప్రైవేటు రాకెట్ శుక్రవారం ఉదయం శ్రీహరి కోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి 89 కి.మీ దూరంలోని అంతరిక్షంలోకి చేరుకొన్నది. దానికి నిర్దేశించిన 80 కి.మీ లక్ష్యాన్ని మించిపోయింది. ఈ రాకెట్ మూడు ఉపగ్రహాలను 81.1 కి.మీ ఎత్తులోని కక్షలో ప్రవేశపెట్టింది. ఇందులో ఒక రాకెట్ చెన్నైకి చెందిన స్టార్టప్ సంస్థ స్పేస్ కిడ్జ్‌ది కాగా మరొకటి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎన్ స్పేస్ టెక్ ఉపగ్రహం, ఇంకొకటి ఆర్మేనియాకి చెందిన బజూమ్ క్యూ అంతరిక్ష పరిశోధన లేబొరేటరీకి చెందినది. 2.5 కిలోల స్పేస్ కిడ్జ్ ఉపగ్రహం ఫన్ శాట్ ను భారత, అమెరికా, సింగపూర్, ఇండోనేషియాలకు చెందిన విద్యార్థులు తయారు చేశారు.స్కైరూట్ వచ్చే దశాబ్ద కాలం లో 20000 చిరు రాకెట్లను ప్రయోగిస్తుందని భావిస్తున్నారు. రైల్వేలను ప్రైవేటుకు అప్పగిస్తున్న రీతిలోనే ప్రభుత్వ రంగంలోని అంతరిక్ష ప్రయోగ సంస్థ అయిన ఇస్రో సౌకర్యాలను వినియోగించుకోడానికి ప్రైవేటును అనుమతించారు. అంతరిక్ష రంగంలో వాణిజ్య లాభాలు విశేషంగా గడించేందుకు వీలుగా ఈ కృషి ప్రారంభమైంది. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగం కూడా పోటీ పడాలనే ఆలోచనే దీనికి అంకురం. ఇందుకు ప్రైవేటులోని స్టార్టప్ సంస్థలు ముందుకు రావడం హర్షించవలసిన అంశం. మొదటి ప్రైవేటు రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ ఏరోసేస్ నాలుగేళ్ళ క్రితం మొదలైన స్టార్టప్ సంస్థే. ఇదొక మైలు రాయి, నవ శకారంభం అని ఇండియన్ నేషనల్ సేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ ఇన్ స్పేస్ సంస్థ చైర్మన్ డా. పవన్ కుమార్ గోయెంకా శ్లాఘించారు.గత సంవత్సరం స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్, వర్జిన్ గెలాక్టిక్ అనే మూడు సంస్థలు అంతరిక్ష ప్రయాణాన్ని కూడా నిర్వహించాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి యాత్రికులను తీసుకు వెళ్ళాయి.భూమికి దగ్గరి కక్షలోకి సామగ్రిని చేర్చాయి. పునర్వినియోగ బూస్టర్ రాకెట్స్‌ను తయారు చేశాయి. ఎలాన్ మస్క్ ఈ రంగంలో ముందడుగు వేస్తున్నాడు. ఈయన 10 మిలియన్ డాలర్లతో రూపొందించిన స్టార్ షిప్ రాకెట్ నవంబర్‌లో అంతరిక్షానికి వెళ్లగలదని భావిస్తున్నారు. ఈ రాకెట్‌ను తక్కువ ఖర్చుతో రూపొందించినప్పటికీ అమెరికా అంతరిక్ష సంస్థ నాసా నుంచి ప్రయోగించడానికి 4.1 బిలియన్ డాలర్ల అత్యంత ఖర్చు అవుతుండడం గమనించవలసిన అంశం. అందుకే వీలైనంత తక్కువ వ్యయంతో పునర్వినియోగ రాకెట్లను పంపించడానికి ఎలాన్ మస్క్ ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. స్టార్ షిప్ రాకెట్‌ను మళ్ళీ మళ్ళీ వాడుకోవచ్చు. అంతేకాదు అంతరిక్షంలోనే ఇంధనాన్ని నింపుకొనే అవకాశాన్ని కూడా అందులో కల్పిస్తున్నారు. ఈ రాకెట్లలో వినియోగించే ఇంధనం చాలా ఖరీదైనది.భూమ్యాకర్షణ శక్తిని ఉల్లంఘించి పైకి పోయే సామర్థ్యాన్ని రాకెట్‌కు కలిగించడానికి అది మోసుకుపోయే బరువు పెరిగే కొద్దీ అత్యధిక ఇంధనాన్ని వాడవలసి వుంటుంది. ఇన్ని పరిమితులను, అడ్డంకులను దాటుకొని అంతరిక్ష వాణిజ్యాన్ని పెంపొందించడం ఎంతో ధనంతో, విజ్ఞానంతో కూడుకొన్నది. అంతరిక్షంలో వాణిజ్య స్థాయి కార్యకలాపాలు గత 15 ఏళ్ళలో మూడు రెట్లు పెరిగాయి. 2005లో 110 బిలియన్ డాలర్ల విలువ చేసిన ఈ కార్యకలాపాలు 2020 నాటికి 357 బిలియన్ డాలర్లకు చేరుకొన్నాయి. ప్రైవేటు భాగస్వాముల ప్రవేశంతో భారతీయ అంతరిక్ష వాణిజ్యం పురోగమించడం ఎంతైనా హర్షించదగిన అంశం.అయితే ప్రైవేటు రంగం తన సొంత మౌలిక సదుపాయాలను ఎంత వరకు సమకూర్చుకోగలుగుతుందో చూడాలి. ప్రైవేటును ప్రోత్స హించే క్రమంలో పబ్లిక్ ప్రయోజనాలను కాపాడడం కూడా ప్రభుత్వ బాధ్యత.

# కోవ్వూరుకు వారసొడుస్తున్నాడు..?

నెల్లూరు, నవంబర్ 19, నెల్లూరు జిల్లాలో టీడీపీకి అనూకూలంగా ఉండే నియోజకవర్గాల్లో కోవూరు ఒకటి. టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో ఇక్కడ టీడీపీనే ఎక్కువ శాతం విజయం సాధించింది.. నల్లపురెడ్డి కుటుంబికులు టీడీపీలో ఉండటంతో వారి పలుకుబటి ఆ పార్టీకి బాగా కలిసోచ్చింది.. అయితే నల్లపురెడ్డి కుటుంబీకులు ఇప్పుడు వైసీపీలో కొనసాగుతున్నారు. కోవూరు నియోజకవర్గంలో ప్రధానంగా టీడీపీ – వైసీపీ మధ్య పోరు నడుస్తుంది. బీజేపీ, జనసేన గత ఎన్నికల్లో నామమాత్రంగాగే ఓట్లు రాబట్టాయి.. వచ్చే ఎన్నికల్లో కూడా ఈ టీడీపీ, వైసీపీల మధ్య గట్టి పోటీ ఉండేలా కనిపిస్తోంది. జనసేన బీజేపీలు కలిసిన నియోజకవర్గంపై పట్టుసాధించలేక పోయాయి. అయితే కోవూరు టీడీపీలో ఆదిపత్య పోరు మాత్రం వదలడం లేదు. పార్టీ గెలుపు కంటే ఎమ్మెల్యే టికెట్ లక్ష్యంగా ఆ ముగ్గురు నేతలు పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. 2019లో ఓటమిపాలైన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వచ్చే ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇస్తే వారసుడిని బరిలోకి దించాలని ఆలోచనలో ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో చివరి వరకూ కోవూరు టికెట్ కోసం ప్రయత్నించి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి భంగపడ్డారు. ఈ సారి టికెట్ కోసం ఆయన కూడా గట్టిగా ప్రయత్రిస్తున్నారని సమాచారం. టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి కోవూరు ఎమ్మెల్యే టికెట్ కోసం తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ఒక పార్టీ టికెట్‌పై త్రిముఖ పోరు నెలకొంది..గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిన పోలంరెడ్డి మూడేళ్లు పాటు టీడీపీకి దూరంగా ఉన్నారు. ఎక్కడా టీడీపీ కార్యక్రమాలకు కూడా హాజరుకాలేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంతో పోలంరెడ్డి దూకుడు పెంచారు. కోవూరులో గ్రావెల్, మట్టి మాఫియా ఆరోపణలతో ఎమ్మెల్యేగా నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో కూడా ప్రజలు ఆశించిన స్థాయితో అభివృద్ధిని సాధింలేక పోయారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగుపరచలేదు. గతంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు టీడీపీపై ఆసక్తి చూపుతున్నారు. కొద్దిరోజల క్రిందటే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధిష్టానం ప్రసన్నపై సీరియస్ అయింది. గతంలో మంచి గ్రాఫ్ ఉన్న నేతలకు మాత్రమే టికెట్ ఇస్తామని జగన్ స్పష్టంగా చెప్పారు.. ప్రసన్న ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొటున్న నేపథ్యంలో ఇది ఇలానే కొసాగితే వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ కష్టమేనని రాజకీయ గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే ఎమ్మెల్యే పని తీరుపై ఆ పార్టీ నేతలే కొంత అసంతృప్తిగా ఉన్నారని.. మండల నాయకులు తాను చెప్పింది వినకపోతే నిర్మొహమాటంగా పార్టీ నుంచి బయటకు పంపుతున్నారనే టాక్ ఉంది.. మరో పక్క టీడీపీ బాదుడే బాదుడు కార్యక్రమం నియోజకవర్గంలో జోరుగా సాగుతుంది. వైసీపీ గడపగడప కంటే టీడీపీ కార్యక్రమానికే ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని.. దీంతో కోవూరులో టీడీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.. వైసీపీ మాత్రం ప్రభుత్వం ఇస్తున్నసంక్షేమ పథకాలే తమను గట్టెంక్కించగలవని వైసీపీ భావిస్తుంది.మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోవూరు టీడీపీ ఇంచార్జిగా ఉన్నారు.. ఇప్పుడు ఆయన వారసుడు దినేష్ రెడ్డికి అవకాశం దక్కింది. ఈమేరకు దినేష్‌కు టీడీపీ అధిష్టానం నియోజకవర్గ ఇంఛార్జిగా బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే పలు నియోజకవర్గంలో దినేష్ రెడ్డి విస్తృతంగా పర్యటిస్తున్నారు. దీంతో రాబోయే ఎన్నికల్లో వైసీపీ తరఫున నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఎదుర్కోబోయేది దినేష్ రెడ్డి అని అందరూ భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో దృష్టిలో ఉంచుకుని గెలుపే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు. అంతేకాకుండా నియోజకవర్గాల్లో విభేదాలు లేకుండా సమన్వయంతో ముందుకు పోతున్నారు. వారసుడు ఎంట్రీతో నియోజకవర్గంలో టీడీపీ బాగానే బలపడుతుందని సమాచారం.. ఇప్పటికే కోవూరు టికెట్ ఆశిస్తున్న వారితో ఆ పార్టీ నుంచి ముగ్గురు నేతలు ప్రయత్నిస్తున్నారు.. అయితే అధిష్టానం టికెట్ ఎవరికి ఇస్తుందో వేచి చూడాల్సిందే..

# టీడీపీ గేమ్ ప్లాన్ ఏంటీ

గుంటూరు, నవంబర్ 19, వచ్చే ఎన్నికల్లో పొత్తుల్లేకుండానే పోటీచేయాలని టీడీపీ భావిస్తుందా? ఇటీవల చేయించుకున్న సర్వేల్లో టీడీపీకి సానుకూల ఫలితాలు వచ్చాయా? ప్రభుత్వ వ్యతిరేకతే తమను గెలిపిస్తుందని టీడీపీ నేతలు నమ్ముతున్నారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. వచ్చే ఎన్నికల్లో తాము పొత్తుల్లేకుండా ఒంటరిగానే పోటీచేయబోతున్నామని టీడీపీకి చెందిన ముఖ్యనేత ఒకరు చెప్పారు. 'పొత్తుల్లేకుంటే టీడీపీ గెలవలేదు. అందుకే ఆ పార్టీ వివిధ పార్టీలతో పొత్తుల కోసం అర్రులు చాస్తోందనే అపవాదు ఉంది. ఈ అపోహలను తొలగించాలి. సొంతంగా బలపడేట్లు ముందుకెళ్లాలి. అందుకోసం ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు! అంటూ సదరు నేత అన్నారు. ఇందులో భాగంగానే టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.ఇప్పటివరకు తెలుగు దేశం పార్టీ పొత్తుల్లేకుండా టీడీపీ ఎన్నికలను గెలవలేదు. అందుకే వచ్చే ఎన్నికల్లో కూడా జనసేన, బీజేపీతో పొత్తు కోసం టీడీపీ అర్రులు చాస్తోంది అనే భావన ప్రజల్లో నెలకొన్నది. అందువల్లే కేంద్రంలోని బీజేపీ పెద్దలను టీడీపీ నేతలు పల్లెత్తు మాట అనడం లేదని జనం భావిస్తున్నారు. అయితే తాము రాష్ట్రంలో బలంగా ఉన్నామని వచ్చే ఎన్నికల్లో సొంతంగానే పోటీచేస్తామని.. ప్రజల్లోకి ఈ విషయాన్ని బలంగా తీసుకెళ్లాలని చంద్రబాబు భావిస్తున్నారట. అయితే అందుకోసం పార్టీని క్షేత్ర స్థాయిలో పూర్తిగా బలోపేతం చేయాలని చంద్రబాబు యోచిస్తున్నారట.ఇటీవల జనసేన గ్రాఫ్?పెరిగిందని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. ప్రజా సమస్యలపై పవన్?కల్యాణ్?చేస్తున్న పోరాటాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయని జనసైనికులు ఉత్సాహంగా ఉన్నారు. గుంతల రోడ్లు, కౌలు రైతు భరోసా యాత్ర, జనవాణి వంటి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వైసీపీ సర్కారు కూడా టీడీపీ ఆందోళనలకు పెద్దగా స్పందించకుండా పవన్? తీసుకున్న అంశాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టింది. ఇది వైసీపీ వ్యూహాత్మక ఎత్తుగడ కావొచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత రేపు జనసేన వైపు మళ్లిందంటే టీడీపీ విజయానికి గండి పడుతుందన్న టీడీపీ ఆందోళన చెందుతోందట. దీంతో జనవరి చివరి కల్లా నారా లోకేష్ చేపట్టే పాదయాత్రతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను టార్గెట్? చేయడం ద్వారా వైసీపీకి ప్రత్యామ్నాయం టీడీపీ మాత్రమేననే సంకేతాలు పంపాలని యోచిస్తోంది. అందుకనుగుణంగా కార్యాచరణ చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది.టీడీపీ చేపట్టే ప్రత్యేక కార్యాచరణ ఏమై ఉంటుందనే దానిపై వైసీపీ, జనసేన పార్టీల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలతోపాటు కేంద్రాన్ని కూడా టీడీపీ టార్గెట్?చేస్తుందా? అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. టీడీపీ అటువంటి నిర్ణయం తీసుకుంటే ఆ పార్టీకి వామపక్షాలు మద్దతు తెలిపే అవకాశముంది. జనసేనానిపై ఒత్తిడి పెరుగుతుంది. పవన్?అటో ఇటో తేల్చుకోవాల్సివస్తుంది. దీంతో బీజేపీ, జనసేన, వైసీపీ వర్సెస్?టీడీపీ, వామపక్షాలు, కాంగ్రెస్‌గా రాజకీయాలు మలుపు తిరిగే అవకాశముంది. టీడీపీ అంత దూకుడుగా అప్పుడే ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందా.. ఇంకా కొంతకాలం వేచి చూసే ధోరణిని కొనసాగిస్తుందా ! అసలు ప్రత్యేక కార్యాచరణలో ఏముంటుందనే దానిపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# ఉడాన్ తో రాజమండ్రి ఎయిర్ పోర్టుకు మహర్దశ

రాజమండ్రి, నవంబర్ 19,ఉభయగోదావరి జిల్లాల వాసులకు గగనతల ప్రయాణ సేవలందిస్తున్న మధురపూడి విమానాశ్రయానికి భవిష్యత్తులో అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకువచ్చేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే 3,165 మాటర్ల పొడవున్న రన్‌వే, 11 పార్కింగ్ బేస్‌తో కూడిన ఏప్రాన్, 11 విమాన సర్వీసులు ఏకకాలంలో నిలుపుదలకు అవకాశం ఉండటం సానుకూలత కలిగిన అంశం. అంతర్జాతీయ స్థాయికి అవసరమైన సదుపాయాలు ఉండటంతో విమానాశ్రయం సేవలను విస్తృతం చేసేందుకు భారత పౌర విమానయాన శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా చర్యలు చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వం విమాన సేవల విస్తృతిలో భాగంగా ప్రవేశపెట్టిన ఉడాన్ రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం, తిరిగి విశాఖ నుంచి రాజమహేంద్రవరానికి మాత్రమే నడుస్తోంది. తక్కువ ధరకే టికెట్టు లభిస్తుండటంతో మంచి డిమాండ్ నెలకొంది. మధురపూడి విమానాశ్రయం నుంచి ప్రస్తుతం 6 విమానాలు 12 సర్వీసులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నంకు రాకపోకలు సాగిస్తున్నాయి. 90 శాతం ఆక్యుపెన్సీతో విమాన సరీ?వసులు నడుస్తున్నాయి. ప్రతి రోజూ 1,200 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. విమాన ప్రయాణికుల రాకపోకల సందర్భంలో స్టే చేయడానికి ఉన్న టెర్మినల్ భవనం సామర్థ్యం విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు.ప్రస్తుతం 4,065 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భవనంలో ఏకకాలంలో 225 మంది ప్రయాణికులు ఉండేందుకు సరిపోతుంది. భవిష్యత్ అవసరాల రీత్యా భవనాన్ని మరో 16,000 చదరపు గజాలకు విస్తరించేందకు కొత్త భవన నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఇందుకు రూ.280 కోట్లు వెచ్చించనున్నారు.ఒకేసారి 1,400 మంది ప్రయాణికులుండే సామర్థ్యానికి విస్తరించనున్నారు. ఐదు విమానాలు ఒకేసారి చేరినా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. విమానాల్లో రాక, పోకలు సాగించే ప్రయాణికుల లగేజీ తనిఖీ వ్యవస్థను వివిధ రకాల్లో ఆధునీకరించనున్నారు. ఇన్‌లైన్ బ్యాగేజీ సిస్టం తీసుకురానున్నారు. ప్రయాణికుల భద్రత, రక్షణ విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నారు. సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేస్తారు. కియోస్క్ ద్వారా ఆధునీకరణ పద్ధతుల్లో ప్రయాణవివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మూడు ఎయిరోబ్రిడ్జిలు నిర్మిచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ బ్రిడ్జిల ద్వారా విమానాశ్రయం నుంచి నేరుగా విమాన సర్వీసులోకి ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో ప్రయాణికులకు ఆలస్యం జరగదు. టెర్మినల్ భవనం నుంచి విమాన సర్వీసు వరకూ వెళ్లేందుకు సమయం వృథాకాదు. ప్రస్తుతం జరుగుతున్న విధానంతో ఆలస్యాన్ని నివారించే వీలుంది.ప్రస్తుతం ఉన్న 6 ఇండిగో విమానాల జాబితాలో మరో ఎలెన్స్ ఎయిర్ సంస్థకు చెందిన విమానం చేరనుంది. రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు నడవనుంది. హైదరాబాద్ నుంచి రాజమండ్రికి సాయంత్రం 4.50 గంటల చేరుతుంది. తిరిగి హైదరాబాద్‌కు 5.20కు బయలు దేరుతుంది. విమానాశ్రయం ఆధునీకరణకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. ప్రస్తుతం ఇండిగో సర్వీసులు నడుస్తున్నాయి. వచ్చే వారం హైదరాబాద్‌కు ఎలెన్స్ ఎయిర్ సంస్థకు చెందిన మరో విమానం ప్రారంభం కానుంది. బోయింగ్ విమాన రాకపోకలకు అనువైన రన్‌వే, పార్కింగ్ ఉండటం రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌కు సానుకూలం. దీన్ని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగానే టెరి?మనల్ విస్తరణ చేపడుతున్నాం. అత్యంత భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణం అందిచాలన్న ఉద్దేశంతో వ్యవహరిస్తున్నాం. కార్గో విమానాలు లేకవడంతో బెల్లీ కార్గో సేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ఒక విమాన సరీ?వసుకు 500 కేజీల లగేజీ అనుమతిస్తున్నాం. కార్గో విమానాలకు ప్రతిపాదనలున్నాయి.

## నేడు ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం


ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబరు 20 న జరుపుకుంటారు. 1954 డిసెంబరు 14 న ఐక్యరాజ్యసమితి జనరల్ శాసనసభ 1956 నుంచి ప్రపంచ బాలల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం వేడుకగా నిర్వహించాలని అన్ని దేశాలకు సూచించింది. 1959 నవంబరు 20న ఐక్యరాజ్యసమితి జనరల్ శాసనసభ బాలల హక్కుల ప్రకటనను ఆమోదించింది. 1989 నవంబరు 20న బాలల హక్కుల పై కన్వెన్షన్ ఆమోదించింది. చాలా దేశాలు ఐక్యరాజ్యసమితి జనరల్ శాసనసభ సూచించిన నవంబరు 20 న ప్రపంచ బాలల దినోత్సవంగా పాటిస్తునారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ స్వచ్ఛంధ సంస్థల అధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించబడుతాయి.

# లాస్ట్ ఛాన్స్ లెక్కేంటీ

కర్నూలు, నవంబర్ 19, రాజకీయ నేతకు లాస్ట్ ఛాన్స్ అనేది ఉండదు. గెలిస్తే అధికారం.. లేకుంటే ప్రతిపక్షం. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇది కొత్త కాదు. ముఖ్యమంత్రిగా ఎంత కాలం ఉన్నారో.. దాదాపు అదే సమయం ప్రతిపక్షనేతగా ఉన్నారు. ఎప్పుడూ లేని ఈ ఎమోషనల్ డైలాగ్ ఆయన నోటి నుంచి వచ్చిందంటే సానుభూతి కోసం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారనే చెప్పాలి. ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్ భేటీ జరగడం, బీజేపీ నుంచి తనకు సానుకూల సంకేతాలు రాకపోవడంతో చంద్రబాబు ఈ డైలాగ్ ను తప్పని పరిస్థితుల్లో వదిలారంటున్నారు. రాజకీయాల్లో లాస్ట్ అనేది ఎవరికి ఉండదు. ఐదేళ్లకొకసారి ప్రజలు ఇచ్చే తీర్పుపైనే ఛాన్స్ ఆధారపడి ఉంటుంది. అంటే చంద్రబాబు గెలిస్తే 2029 ఎన్నికల్లో పోటీ చేస్తారు. మరి అప్పుడు లాస్ట్ ఛాన్స్ ఎలా అవుతుంది. కేవలం అధికారంలోకి రావడానికి ఎమోషనల్ గా ప్రజలను తన వైపునకు తిప్పుకోవడానికే లాస్ట్ ఛాన్స్ డైలాగ్ ను వదిలారన్నది అర్థమవుతుంది. నలభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు ఈ మాటను ఊరికే అన్నారని అనుకోలేం. అనుకోవడానికి కూడా ఆయన ఆషామాషీ నేత కాదు. అన్యాపదేశంగా వచ్చిన మాట కాదు. పవన్ కల్యాణ్ తనకు ఒక్క ఛాన్స్ అన్న తర్వాతనే చంద్రబాబు నోటి నుంచి ఈ డైలాగు వచ్చిందంటే ఆయన వచ్చే ఎన్నికల్లో తాను వామపక్షాలతో కలసి వెళ్లేందుకు ఫిక్స్ అయ్యారనే అనుకోవాలి.అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఆంధ్రప్రదేశ్ లో సెంటిమెంట్ పనిచేస్తుందా? అంటే కాదనే చెప్పలేం. 2003లో చంద్రబాబుపై అలిపిరి వద్ద బాంబు దాడి జరిగిన తర్వాత సెంటిమెంట్ తో ఆయన ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. దాదాపు కొన్ని రోజుల పాటు ఆయన చేతికి కట్టుతో ప్రజల ముందుకు వచ్చి సానుభూతి కోసం ప్రయత్నించారు. కానీ ఆ ఎన్నికల్లో మాత్రం ఆయనను ప్రజలు ఆదరించలేదు. అదే సమయంలో పాదయాత్ర చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డిని చేరదీశారు. అంతే తప్ప చంద్రబాబు పై హత్యాయత్నం జరగడాన్ని ప్రజలు ఎవరూ పట్టించుకోలేదు. అలాగే జగన్ ను కూడా 2014 ఎన్నికలకు ముందు 16 నెలలు జైల్లో పెట్టినా, జగన్ పై అక్రమ కేసులు బనాయించారని జగన్ తల్లి విజయమ్మ, చెల్లి షర్మిల ఊరూరా తిరిగినా ప్రజలు అక్కున చేర్చుకోలేదు. 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు వంగి వంగి నమాస్కారాలు పెట్టారు. శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నట్లు ప్రకటన చేశారు. అన్ని నియోజకవర్గాలలో తానే అభ్యర్థినని, తనను చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. మోదీపై ధర్మ పోరాటం చేశారు. అయినా 2019 ఎన్నికల్లో మాత్రం ఎలాంటి సెంటిమెంట్ ను ప్రజలు పట్టించుకోలేదన్నది యదార్థం. ఇప్పుడు కూడా లాస్ట్ ఛాన్స్ అన్న ఎమోషనల్ సెంటిమెంట్ ను ఏ మేరకు ప్రజలు ఆదరిస్తారన్నది ప్రశ్నగానే ఉంది. అదే ఇప్పుడు తెలుగుదేశం పార్టీ నేతలను కలవరపెడుతున్న అంశంగా మారింది.

# పోలవరం నత్తనడక...

ఏలూరు, నవంబర్ 19, (న్యూస్ పల్స్) పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగడం లేదని పీపీఏ నివేదిక వెల్లడించింది. ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయని వివరించింది. గత ఏడాది కాలంలో కీలకమైన భూసేకరణ, పునరావాసం పనులు కేవలం 1.97 శాతమే పూర్తయ్యాయని తెలిపింది. మొత్తం పనుల్లో ఏడాదిలో జరిగినవి 5.4 శాతం మాత్రమేనని చెప్పింది. ఇందులోనూ అత్యంత ప్రధానమైన బెడ్ వర్క్ లో పురోగతి 0.99 శాతమే. భూసేకరణ, పునరావాస పనులు 2021 అక్టోబర్ 31 నాటికి 20.19 శాతం జరిగితే, 2022 అక్టోబర్ 31 నాటికి పూర్తయింది. 22.16 శాతమే. మొత్తంగా ప్రాజెక్టులో హెడ్ వర్క్, కాలువలు అన్నీ కలపి నిరుడు అక్టోబర్ 31 నాటికి 42.56 శాతం పూర్తయితే, ఈ ఏడాది అక్టోబర్ నాటికి అది అతి కష్టం మీద 47.96 శాతానికి చేరింది. ఈనెల 16వ జరిగిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమావేశంలో సంబంధిత ఇంజినీర్లు ఇచ్చిన ప్రజెంటేషన్ ప్రకారమే ప్రాజెక్టులో 50 శాతం పనులు పూర్తి కాలేదు. ప్రాజెక్టులో కొన్ని పనులు చేసే గుత్తేదారులను తొలగించారు. ఆ స్థానంలో కొత్త గుత్తేదారులను ఎంపిక చేయలేదు. బెడ్ వర్క్ లో ఎడమ వైపు నావిగేషన్ కాలువ, లాక్ కు సంబంధించిన పనిని ముందుగానే ముగిస్తూ.. 2020 జులై ఎనిమిదవ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పనిని ఇప్పటి వరకు మరొకరికి అప్పగించలేదు. ఎడమ కాలువకు సంబంధించి మిగిలిన 5 ప్యాకేజీల పనుల కాంట్రాక్టర్లను రెండేళ్ల క్రితం తొలగించినా ఇప్పటి వరకు కొత్త వారిని ఎంపిక చేయలేదు. డిస్ట్రిబ్యూటరీ పనులు అయితే ఎప్పుడు చేపడతారో, ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేని పరిస్థితి. 2017 – 18 సంవత్సరం ధరల ప్రకారం రూ.55,656.87 కోట్ల సవరించిన అంచనాను కేంద్రానికి పంపారు. ఆర్థిక శాఖ ఆధ్వర్ంలోని కమిటీ రూ.47,725..74 కోట్లకు సిఫార్సు చేసింది. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించలేదు. 2013 – 14 ధరల ప్రకారమే చెల్లిస్తామని చెప్పింది. అదే జరిగితే తాజా అంచనాలో సగం కూడా రాదు. ఈ క్రమంలోనే తాజా వ్యయాన్ని ఆమోదించాలంటూ రాష్ట్రం పంపిన దస్త్రం రెండేళ్లుగా అటూ ఇటూ తిరుగుతూనే ఉంది. తుది ఆమోదంతో సంబంధం లేకుండా మొదట 41.15 మీటర్ల వరకు నీటి నిల్వకు వీలుగా రూ.10 వేల కోట్లు ఆడ్ హక్ గా విడుదల చేయాలని రాష్ట్రం కోరినా దానికీ అతీగతీ లేదు. పైగా గతంలో చెల్లించిన బిల్లలుపైనే ఆడిట్ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. తాగునీటి సరఫరాకు అయ్యే మొత్తాన్ని ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో భాగంగా చూడాలన్న రాష్ట్ర వినతిపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీపీఏ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. మొదట 41.15 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసి పాక్షిక ప్రయోజనాలు కల్పించేందుకు రూ.10,485.38 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేసి ఆరు నెలలు దాటింది. కానీ ఇప్పటి వరకు ఏమీ జరగలేదు. తాజా నివేదిక ప్రకారం 2022 అక్టోబర్ వరకు రూ.20,174.24 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత రూ.15,970.53 కోట్ల పనులు చేశారు. దీనిలో కేంద్రం రూ. 13,097 కోట్లు తిరిగి ఇచ్చిందని, మరో రూ.2,873 కోట్లు రావాల్సి ఉందని తాజాగా ఏపీ పీపీఏకు ఇచ్చిన నివేదిక వెల్లడించింది.



# టీడీపీ అభ్యర్థిగా సునీత పోటీ



కడప, నవంబర్ 19,కడప మాజీ ఎంపీ, మాజీ మంత్రి దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో దిగబోతున్నారా? కొన్ని సంఘటనలు, కొందరి మాటలను బట్టి చూస్తే.. నిజమే కావచ్చనే అంచనాలు రాజకీయ వర్గాలు, విశ్లేషకుల నుంచి వస్తున్నాయి. వైఎస్ వివేకానందరెడ్డిని పులివెందులలో ఆయన నివాసంలోనే దుండగులు అత్యంత దారుణంగా గొడ్డలితో నరికి చంపేశారు. ఆ సమయంలో టీడీపీ అధికారంలో ఉంది. ఆ హత్యతో అప్పటి సీఎం చంద్రబాబుకు ముడిపెట్టిన జగన్ రెడ్డి మీడియా 'నారాసుర రక్త చరిత్ర' అంటూ ఊరూవాడా గగ్గోలు పెట్టింది. అయితే.. సీబీఐ దర్యాప్తులో వివేకా హత్య కుట్ర వెనుక ప్రముఖుల హస్తం ఉందనే అంచానా వచ్చింది.తర్వాత 2019లో జగన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ సర్కార్ ఏర్పాటైంది. జగన్ సర్కార్ వచ్చి నాలుగేళ్లవుతున్నా.. వివేకా హత్య కేసు కొలిక్కి రాకుండా సూత్రధారులతో పాటు 'ముఖ్య నేత' కూడా అడ్డుపడుతున్నారనే ఆరోపణలు, అనుమానాలు వచ్చాయి. అంతేకాదు.. స్వయంగా వివేకా కుమార్తె సునీత అదే విధమైన అనుమానాలు వ్యక్తం చేశారు.దివంగత వివేకానందరెడ్డి సీఎం జగన్ కు సొంత బాబాయ్. పినతండ్రి హత్య కేసులో చిక్కుముడి విప్పించాలని సోదరి అయిన సునీత స్వయంగా జగన్ వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, పైగా లైట్ తీసుకున్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. తాను ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసిన జగన్.. తానే సీఎం అయ్యాక ఈ కేసును నీరుగార్చేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పైగా వివేకా కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులను కొందరు బెదిరించడం, తిరిగి వారిపైనే కేసులు పెట్టడంతో విసిగిపోయిన సునీత సీబీఐ విచారణను ఏపీలో కాకుండా మరే ఇతర రాష్ట్రానికైనా బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పోరాడారు. కేసు పూర్వాపరాలు సమీక్షించిన సుప్రీంకోర్టు కేసు విచారణను మరో రాష్ట్రాన్ని బదిలీ చేయడానికి అంగీకరించింది.తండ్రి హత్య కేసులో నిందితులెవరో.. సూత్రధారులెవరో.. తేల్చేందుకు వివేకా కుమార్తె సునీతారెడ్డి పట్టు వదలని విక్రమార్కుడిలా ధైర్యంగా న్యాయ పోరాటం చేస్తూనే ఉన్నారు. తండ్రి హత్య విషయంలో సీఎం స్థానంలో ఉన్న అన్న జగన్ నుంచి సహకారం అందకపోయినా ఆమె విశ్రమించడం లేదు. పులివెందుల గల్లీ నుంచి దేశ రాజధాని ఢిల్లీ దాకా ఆమె కాలికి బలపం కట్టుకుని ఒంటరి పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో వైఎస్ సునీతకు అనూహ్యంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి మద్దతు లభిస్తోంది. సునీత పోరాటానికి మద్దతుగా నిలబడాలని ఆయన కొద్ది రోజుల క్రితమే నిర్ణయించారు. కొన్ని సభల్లో చంద్రబాబు సునీత పోరాటాన్ని ప్రశంసించారు. తోడ్పాటుగా ఉంటామని కూడా చెప్పారు.ఇప్పుడు చంద్రబాబు నాయుడు 'బాదుడే బాదుడు' పేరిట చేస్తున్న జిల్లాల పర్యటనల్లో సునీతకు మద్దతు గురించి బహిరంగంగా చెబుతున్నారు. తాజాగా కర్నూలు జిల్లా పర్యటనలో చంద్రబాబు ఈ విషయం స్వయంగా ప్రకటించారు. సునీతకు మద్దతుగా నిలబడదామని టీడీపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు జిల్లాల పర్యటనల సందర్భంగా వచ్చే ఎన్నికలకు ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తుండడం విశేషం. రాజకీయంగా తన ఆగర్భ శత్రువు జగన్ ను ఢీకొట్టే ఎన్నికల వ్యూహాన్ని ఈ అపర చాణక్యుడు రచించినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో జగన్ పై వైఎస్ సునీతను టీడీపీ అభ్యర్థిగా బరిలో దింపాలని డిసైడ్ అయ్యారని అంటున్నారు. ఎందుకంటే.. పులివెందులలో వైఎస్ రాజశేఖరరెడ్డికి, జగన్ కు మంచి పట్టు ఉంది. అయితే.. అంతే పట్టు హత్యకు గురైన వైఎస్ వివేకానందరెడ్డికి కూడా ఉందంటారు. ఒక సందర్భంలో వైఎస్ రాజశేఖరరెడ్డే ఈ విషయం చెప్పారంటారు. తండ్రి వివేకాకు ఉన్న పలుకుబడి, ఆపైన ఆయన దారుణ హత్యకు గురయ్యారనే సానుభూతి కూడా సునీత విజయానికి మార్గం వేస్తాయని చంద్రబాబు అంచనా వేస్తున్నారంటున్నారు. ఒకవేళ సునీత పులివెందులలో పోటీకి చేయడానికి ఒప్పుకోకపోతే.. కడప ఎంపీ స్థానంలో అయినా బరిలో దిగేలా ఒప్పించాలని చూస్తున్నారని తెలుస్తోంది. ఒకవేళ సునీత కడప ఎంపీ స్థానంలో పోటీకి ఒప్పుకుంటే.. తన తండ్రి హత్య వెనుక ఉన్నారనుకుంటున్న వారిపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం ఉందంటున్నారు. కడప ఎంపీ సీటు విషయంలో వచ్చిన విభేదాలే వివేకానందరెడ్డి దారుణ హత్యకు కారణం అంటారు.సునీతారెడ్డిని చంద్రబాబు కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ లో కలిశారని, ఆమెకు పులివెందుల నుంచి జగన్ పై బరిలో దింపాలనుకుంటున్నట్లు.. లేదా కడప ఎంపీ స్థానంలో పోటీ చేయించే ప్రతిపాదన గురించి చెప్పారని విశ్వసనీయ సమాచారం. చంద్రబాబు ప్రతిపాదనకు సునీతను ఒప్పించేందుకు ఓ టీడీపీ ముఖ్య నేత సంప్రదింపులు జరుపుతున్నారని తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలకు సునీత తొలుత కాస్త విముఖంగా ఉన్నా తర్వాత ఆలోచనలో పడ్డారని అంటున్నారు. అయితే.. వచ్చే ఎన్నికల్లో సునీత స్వయంగా టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగుతారా? లేక తన ఫ్యామిలీ నుంచి మరొకరితో పోటీ చేయిస్తారా? అనేది స్పష్టం కావాల్సి ఉందంటున్నారు.వైఎస్ సునీత టీడీపీ అభ్యర్థిగా పులివెందుల నుంచి పోటీ చేసినా.. కడప బరిలో దిగినా 'వన్ షాట్ టూ బర్డ్స్' సామెతను చంద్రబాబు మరోసారి నిరూపించినట్లు అవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## ఆక్వా రైతుల కీలక నిర్ణయం.. నో క్రాప్ హాలిడే

ఏలూరు, నవంబర్ 19,తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆక్వా రైతులు ప్రభుత్వాన్ని కోరారు. నిపుణుల సూచన మేరకు ఆక్వారంగంలో క్రాఫ్ హాలిడే నిర్ణయాన్ని రైతులు విరమించుకున్నారు. ఆక్వా సంక్షోభం సమయంలో క్రాఫ్ హాలిడేకు వెళితే నష్టపోతామని సీఫుడ్ ఎక్స్ పోర్టర్స్ సూచనలకు రైతులు తలొగ్గారు. ఏపీలో ఆక్వా సంక్షోభం నేపథ్యంలోని రాజమండ్రిలో రైతులతో సీఫుడ్ ఎక్స్ పోర్టర్స్ నిర్వహించిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈసమావేశానికి 70 మంది ఎక్స్ పోర్టర్లు, గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 300 మంది ఆక్వా రైతులు హాజరయ్యారు. రానున్న రెండు నెలల కాలంలో సంక్షోభం సమసి పోతుందని అభిప్రాయపడ్డారు. అంతవరకు క్రాప్ తగ్గించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎక్స్ పోర్టర్స్ అసోసియేషన్ సభ్యుడు, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్ రావు మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు రైతులతో సమావేశం అయ్యామని అన్నారు. ఈ సంక్షోభం తాత్కాలికమేనని రెండు మూడు నెలల్లో అంతర్జాతీయంగా ఆక్వా పరిస్థితి మెరుగుపడవచ్చని ఆయన అభిప్రాయ ద్దారు. రైతులు ఆక్వా క్రాప్ హాలిడే ఆలోచన లేదన్నారు. 30 కౌంట్ రొయ్యలు పండించమన్నామని తెలిపారు. రైతులతో ప్రతిపక్షాలు రాజకీయం చెయ్యొద్దని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ ఆశీసుల మేరకు ఇకపై రైతులతో తరచుగా సమావేశం అవుతామని వెల్లడించారు. ఎక్స్ పోర్టర్స్ అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇకపై రొయ్యలు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. 30 కౌంట్ రూ.380కి 100 కౌంట్ 210 రూపాయలకు కొనుగోలు చేస్తామని అన్నారు. అంతర్జాతీయంగా వచ్చిన సమస్యతో ఏపీలో ఆక్వా సంక్షోభం వచ్చిందని అంటున్నారు.

## ముందస్తు ఎన్నికల అడుగులు

విజయవాడ, నవంబర్ 19, ఏపీలో జగన్ ప్రభుత్వానికి అన్ని వైపుల నుంచి చిక్కులే ఎదురౌతున్నాయి. ఏ నిర్ణయం తీసుకున్నా బూమరాంగ్ అవుతోంది. ఏ పని చేసినా చేదు అనుభవంగానే మిగులుతోంది. అసలు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇన్ని సార్లు కోర్టుల చేత అక్షింతలు వేయించుకుని ఉండదు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లయ్యింది. ఇంకా ఏడాదిన్నర గడువు ఉంది మరో సారి ప్రజా తీర్పు కోరడానికి. ప్రజలు మనవైపే ఉన్నారు.. ఈ సారి 151 కాదు.. 175కు 175 స్థానాలలోనే తమదే విజయం అంటూ జగన్ గంభీరంగా ప్రకటనలు గుప్పిస్తున్నా.. అదే మాట చెప్పి క్యాడర్ లో ఉత్సాహాన్నినింపాలని ప్రయత్నిస్తున్నా.. పరిస్థితులు చూస్తుంటే మాత్రం అది కేవలం మేకపోతు గాంభీర్యంతో చేస్తున్న ప్రకటనలేనని పార్టీ వర్గాలకే అర్థమై పోతున్నది.మరో ఏడాదిన్న పాటు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని నడపడం అంటే మరింత ప్రజా వ్యతిరేకతను ప్రోది చేసుకోవడమేనన్న నిర్ణయానికి సీఎం జగన్ వచ్చేశారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అందుకే ముందస్తు ప్రణాళికలు రచించడమే కాకుండా అమలులో పెట్టేస్తున్నారు. నియోజకవర్గ సమీక్షలంటూ హడావుడి చేస్తున్నారు. వర్క్ షాపులంటూ ఎమ్మెల్యేలలో ఈ సారి పార్టీ టికెట్ అనుమానమేనని మానసికంగా సిద్ధం చేస్తున్నారు.అన్నిటికీ మించి ఎన్నికల బదిలీలకు శ్రీకారం చుట్టేసింది. ముఖ్యంగా పోలీసు శాఖలో బదిలీల స్పీడ్ చూస్తుంటే ఈ విషయం క్లియర్ గా అర్థమౌతుంది. కీలక స్థానాలలో అనుకూలమైన పోలీసు అధికారాల నియామకం దాదాపు పూర్తి చేసేసిందనే చెప్పాలి.సాధారణంగా ఇలాంటి బదలీలన్నీ ఎన్నికలకు ముందు జరుగుతాయి. అయితే రాష్ట్రప్రభుత్వం మాత్రం ఎన్నికలకు ఇంకా ఏణ్ణర్ధం ఉండగానే చేసేస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు వెళితే పరిస్థితి ఇప్పటి కంటే దారుణంగా ఉంటుందని అంచనా వేస్తోంది. అందుకే ముందస్తు ఎన్నికలకు రెడీ అయిపోతున్నది.ఎన్నికలు ఎప్పుడు జరగొచ్చు అనే విషయంలో మాత్రం రెండు మూడు ఆప్షన్ ను పరిశీలిస్తోంది. పొరుగు రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్లినా లేకున్నా మరో ఏడాదిలో జరగాల్సి ఉంది. అందుకే ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి.. ఏపీ ప్రభుత్వం తన నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. మొత్తం మీద వచ్చే ఆరు నెలలలో జగన్ సర్కార్ ఎప్పుడైనా ముందస్తు ప్రకటన చేసే అవకాశం అయితే ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఆలస్యం చేసే కొద్దీ ప్రభుత్వ వ్యతిరేకత మరంత పెరగడమే కాకుండా.. ఇప్పటికే బలంగా పుంజుకున్న తెలుగుదేశం మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని కూడా జగన్ భావిస్తున్నారు. తెలుగుదేశం సభలకు వస్తున్న ప్రజాదరణ, అదే సమయంలో ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజా నిరాసక్తత ఎన్నికలు జాప్యం అయ్యే కొద్దీ మరింత పెరుగుతాయని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు.

## పాలకొండలో రైతుల భేటీ

పార్వతీపురం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో రైతులు ప్రజాసంఘాలతో ఈరోజు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి అభ్యుదయ రైతు కండాపు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది .ఈ సందర్భంగా అతను మోడీ ప్రవేశపెట్టిన మూడు మాట్లాడుతూ మోడీ ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు వ్యతిరేకంగా ఆల్ ఇండియా కిసాన్ సంఘం ఆధ్వర్యంలో 400 రైతు సంఘాలుతో ఢిల్లీలో అప్పుడు పాల్గొన్నారు. ఈరోజుకి నల్ల చట్టాలు రద్దుచేసి 100 రోజులు పూర్తయిన సందర్భంగా. పాలకొండలో సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవరోధాలు కల్పించిన నిరోచితంగా పోరాడి అందులో సుమారు పోరాడి అందులో సుమారు 650 మంది రైతులు మరణించారు .అంతేగాక కేంద్ర సహాయ మంత్రి కొడుకు ఆశో దోస్త్ మిశ్రా నిరసనలో పాల్గొన్న రైతులు పై కార్ తొక్కించి నలుగురు కారకడయ్యాడు అలహాబాద్ హైకోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది. దీనిపై రైతులు పోరాడగా సుప్రీంకోర్టు బెల్ రద్దుచేసి ఐదు దినాల్లో లోంగిపోమని తీర్పించింది. పోరాటల ఫలితంగా మోడీ రైతులకు క్షమాపణ చెప్పారు. మూడు చట్టాలు నిరసనగా నాకు వచ్చిన అవార్డులను పాలకొండ ఆర్డీఓకి అప్పుడే అప్పగించుతాను . అవార్డులు తీసుకోమని రమ్మని పిలుస్తున్నారు. నా డిమాండులు అంగీకరిస్తే అవార్డులు తీసుకుంటామని తెలిపారు. వంద రోజులు నలచట్టాలు రద్దు అయిన సందర్భంగా ప్రజాసంఘ నాయకులతో స్వీట్లు రైతులు పంచుకున్నారు.

### కురికాల గ్రామంలో మరుగుదొడ్ల స్వచ్ఛతపై సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామంలో మరుగుదోడ్లు,స్వచ్ఛతపై అవగాహన కల్పించి పాఠశాల విద్యార్థులతో సర్పంచ్ నవీన్ రావు శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సెక్రటరీ సాయిబాబా,అంగన్వాడీ టీచర్స్ వెంకటమ్మ,సుజాత,ఆశ వర్కర్ లు మమత,రాధ,ప్రిన్సిపాల్ పూరషోత్తం,ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి,పెరంట్స్ సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి మరుగుదొడ్ల వాడకం పరిసరాల పరిశుభ్రత స్వచ్ఛత పలు అంశాలపై సర్పంచ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా అధికారి శ్రీనివాస్,ఎస్ ఎం సి చైర్మన్ సదాల భాస్కర్,ప్రైమరీ స్కూల్ ఎస్ ఎం సి చైర్మన్ ద్యావ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కరపత్రాలు ఆవిష్కరించిన అఖిల పక్షం




కడప నవంబర్ 19: రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, టిడిపి నగర అధ్యక్షుడు శివకొండ రెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, విలేకరులతో మాట్లాడుతూ, భావన టౌన్షిప్ లోనిర్మితమవుతున్న వెంచర్ పూర్తిగా ప్రభుత్వ భూములలో ఉందని ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకొని అక్రమంగా ప్లాట్లు వేసి సెంటు 13 లక్షల తోటి వందల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. బుద్ధన్నా వాళ్ళు ఎక్కడ వెంచర్ వేసిన ప్రభుత్వ భూముల్లోనూ అక్రమంగా కబ్జాలు చేస్తు అందులో మాత్రమే వెంచర్లు వేస్తారని ఈ సందర్భంగా వారు చెప్పారు. బుద్ధ టౌన్ షిప్ లో కూడా ఇలానే వంక పోరంబోకు స్మశాన స్థలాన్ని ఆక్రమించుకొని ఈరోజు సెంట్ 22 లక్షల అమ్ముతున్నారని వారు గుర్తు చేశారు, అదే పద్ధతిలో ఈరోజు మూల వంక దగ్గర ఉన్న ఊటూకూరు పొలంలో 50 ఎకరాలకు పైగా భూమిని కబ్జా చేసి సెంటు 13 లక్షలతో అమ్మకానికి పెట్టారని వారు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడడానికి రెవెన్యూ పోలీస్ అధికారులు ఉంటే! కబ్జా చేసిన వాళ్లకు అండగా ఉండి, వాటిని వ్యతిరేకించిన వారిపై కేసులు పెడతామనటం పత్రికలపై కేసులు పెడతామనటం బెదిరించడం దౌర్జన్యానికి పాల్పడడం అన్నది విచిత్రంగా ఉందని వారు ఆగ్రహించారు. కృష్ణ కిషోర్ రెడ్డి దగ్గర కొన్నాం అన్న రాజేంద్ర ప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితమని, ఎకరా 30 లక్షలకు కొన్న రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, 13 కోట్లకు ఎలా అమ్ముతున్నాడు అని వారు ప్రశ్నించారు. 13 కోట్ల విలువచేసే ఎకరా భూమిని మీకు 30 లక్షలకే కృష్ణ కిషోర్ రెడ్డి ఏ బెదిరింపులు లేకుండా భయపెట్ట కుండా మీకు ఎలా ఇచ్చాడని చెప్పడానికి ఎలా సాధ్యమవుతుం దని దీనిని ఎవరు నమ్మాతారని దీనిపై ప్రశ్నలు వేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే రోడ్డుని వాళ్ళ సొంత జాగిరిలా మార్చుకున్న తీరుని తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, 22న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని వారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలోఆర్ సి పి సీనియర్ నాయకులు లింగమూర్తి, నగర కార్యదర్శి మక్బూల్ బాషా, రైతు సంఘం నాయకులు ప్రతాపరెడ్డి, డి జి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి రాజు, నాయకుడు ప్రసాద్, రవి, లోకేష్, మునేంద్ర. తదితరులు పాల్గొన్నారు

## పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇందిరమ్మ



కడప నవంబర్ 19: పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇందిరమ్మ అని భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ చరిత్ర సృష్టించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు శనివారం ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా శ్రేణులతో కలిసి నీలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఓల్డ్ రిమ్స్ వద్ద గల ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పిసిసి డెలికేట్ బండి జకరయ్య లు మాట్లాడారు .భారతరత్న శ్రీమతి ఇందిరాగాంధీ పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు.గరీబి హటావో నినాదంతో భారతదేశం నుంచి పేదరికాన్ని పారద్రోలాలని ప్రయత్నాలు చేశారన్నారు.హరిత విప్లవం తీసుకుని వచ్చి ప్రజలు మూడు పూటలా భోజనం చేయడానికి, తిండి గింజలు ఎగుమతి చేయడానికి అవకాశం కల్పించార న్నారు.20 సూత్రాల కార్యక్రమంతో ప్రజలందరికీ కూడు, గుడ్డ ,ఇల్లు, విద్యా ,వైద్యం అందేలా చూశారన్నారు.పాకిస్తాన్ ను ఓడించి, చైనా పొగరు అణచి, భారతదేశ ఖ్యాతిని నిలిపారన్నారు.శాస్త్ర ,సాంకేతిక రంగాలలో సైతం భారతదేశాన్ని ఉన్నత ప్రధాన నిలిపారన్నారు.బ్యాంకులు జాతీయం చేయడం, రాజభరణాల రద్దు లాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు.సిక్కుల కోసం పంజాబ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు.ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రతి ఏటా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని, మొదటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతిని అన్ని జిల్లాలలో దేశవ్యాప్తంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.గత పాలకులు చేసిన సేవలను విస్మరించడం సరైన చర్య కాదన్నారు.మాజీ ప్రధానులను గౌరవించడం ప్రధాని నరేంద్ర మోడీ నేర్చుకోవాలన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తోపాటు, పీసీసీ డెలిగేట్ బండి జకరయ్య, తిరుమలేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలా దేవి, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, బీసీ సెల్ జిల్లా చైర్మన్ నూకల చిన్న కులయప్ప, బీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాసులు, మైనార్టీ నగర అధ్యక్షుడు ఆసిఫ్ ఖాన్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, బీసీ నగర అధ్యక్షుడు వేణుగోపాల్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి సాదిక్ అలీ, బీసీ నేతలు ఎరికలయ్య, ప్రసాద్ ,సూర్యుడు, అరుణ, అలెక్స్ సురేష్, పాల్గొన్నారు

## జర్నలిస్టుల సమస్యలపై జాప్ నిరంతర పోరాటం

కడప నవంబర్ 19 కడప జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక యూనియన్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్) అని రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కడప జాప్ మీడియా సెంటర్లో, నిరాశ్రయుల, అనాధల వృద్ధాశ్రమంలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ 30వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షులు మాదాల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. వెంకట రమణ, జిల్లా కార్యదర్శి భరత్ రెడ్డి తో పాటు పాత్రికేయుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. నవంబర్ 19 జాప్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్నిపురస్కరించుకొని జాప్ మీడియా సెంటర్లో కేక్ కట్ చేసి 30 వ వార్షిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు అనంతరం కడప ఓల్డ్ రిమ్స్ లో ఉన్నటువంటి ఆదరణ ఆశ్రమంలోని అనాధ లకు, వృద్ధులకు అన్నదానం చేశారు ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ తమ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవితేజ, కోన శశిధర్ల నేతృత్వంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఇందులో భాగంగా వైయస్సార్ కడప జిల్లాలో నిర్వహించామన్నారు తమ జాప్ గత 30 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు చిన్న మధ్య తరహా పత్రికల్లో పని చేస్తున్న పాత్రికేయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు, పాత్రికేయులకు ఎటువంటి చిన్న సమస్య ఎదురైన తక్షణం స్పందించి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు అంతే కాకుండా తాము అనుబంధంగా ఉన్న నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియా ఆధ్వర్యంలో కూడా సమస్యల పైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటం చేస్తున్నామని అన్నారు రాష్ట్రవ్యాప్తంగాజర్నలిస్టులు ఎదుర్కొంటున్న అక్రిడియేషన్ రైల్వే పాసు బస్సు పాసుల తో పాటు సీనియర్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు తమిళనాడు రాష్ట్ర తరహాలో పదవీ విరమణ పొందిన జర్నలిస్టులకు పెన్షన్ విధానం పై త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతుందని అన్నారు,

## అగ్నిప్రమాదంలో బంకులు, బైకులు దగ్ధం

ప్రకాశం ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని రేడియో బావి సెంటర్లో, గ్రంథాలయం పక్కనచ వున్న చిరు వ్యాపారుల బంకులు రాత్రి అగ్నిప్రమాదం సంభవించి కాలి బుడిదయ్యాయి ,బంకులు తగలబడి పోతున్న విషయం అగ్నిమాపక సిబ్బందికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేయడం జరిగింది, అప్పటికే బంకులు,రిపేరుకు వచ్చిన బైకులు అన్ని కాలి బూడిదయ్యాయి,ఇందులో ఒక టీకొట్టు, 2టైలర్ బంకులు , మెకానిక్ బంకు, ఇస్త్రీ బంకులు ఉన్నాయి, సుమారు 3 లక్షల ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అంచనా. ఈ సంఘటన ప్రమాద వశాత్తు జరిగిందా లేక ఎవరన్నా కావాలని చేశారా అని స్థానికులు చర్చించు కుంటున్నారు.

## సీఎం జగన్ కటౌట్ కు నిప్పు

విజయవాడ సిఎం జగన్ కటౌట్ కు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఘటన కృష్ణా జిల్లాగూడూరులో చోటు చేసుకుంది. శుక్రవారం అర్థరాత్రి సమయంలో నిప్పటించారు. దాంతో సీఎం కటౌట్ సగం కాలిపోయింది. మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారి ప్రక్కన గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీఎం కటౌట్ ఏర్పాటు చేసారు. బందరు డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వైకాపా నేతలు సిఎం జగన్ కటౌట్ కు నిప్పు పెట్టడం తీవ్రంగా ఖండించారు.

## చినబ్రహ్మాదేవంలో ప్రబలిన డయోరియా

కాకినాడ తాగునీరు కాలుష్యం అవ్వడంతో కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చినబ్రహ్మాదేవం గ్రామంలో డయేరియా ప్రబలి వాంతులు, విరోచనాలు, జ్వరం లక్షణాలతో 53 మంది పెద్దలు,పిల్లలు ఆసుపత్రి పాలయ్యారు. దింతో గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. క్రమేపీ కేసుల సంఖ్య పెరగడంతో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా గ్రామానికి చేరుకుని వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. వాటర్ ట్యాంక్లపై చాలా కాలం నుండి మూతలు లేవని పంచాయితీ అధికారులు ట్యాంక్ నీ శుభ్రపరచడం లేదని కలెక్టర్ను గ్రామానికి చెందిన పలువురు మహిళలు నిలదీశారు. గ్రామంలో ఇప్పటి వరకు 53 కేసులు నమోదయ్యాయన్న కలెక్టర్...గ్రామంలో ఇద్దరు డాక్టర్లు, రెండు అంబులెన్స్ లు 24 గంటలు అందుబాటులో ఉండాలని అధికారులకు అదేశాలు జారీ చేశారు. వాటర్ శాంపిల్స్ టెస్టింగ్ పంపించామని...అవసరమైతే బ్లడ్ శాంపిల్స్ కూడా టెస్టింగ్ కు పంపుతామని కలెక్టర్ తెలిపారు. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే చినరాజప్ప గ్రామానికి చేరుకుని వైద్యులను అడిగి పరిస్థితి తెలుసుకున్నారు. తాగునీరు కాలుష్యం కారణం కావడంతో గ్రామంలో తాగునీటి సరఫరాను పూర్తిగా నిలిపివేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దింతో గ్రామానికి ట్యాంకుల ద్వారా నీటిని పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

## ఎంపి అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలి

విశాఖపట్నం విశాఖ పరిధిలోని కూర్మన్న పాలెంలో వైసీపీ ఎంపీ ఎంవీవీ సత్యనా రాయణ చేపడుతున్న అక్రమ నిర్మాణా ల పై సమగ్ర విచారణ చేపట్టాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృ ష్ణబాబు డిమాండ్ చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎంపీ నిర్మాణాలు చేపట్టిన స్థలానికి సంబం ధించిన అసలైన హక్కుదారుల తో కాకుండా పక్కనున్న భూయజమా నులతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు.ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలకు ఆనుకుని 1,200 గజాల్లో పార్కు ఉందన్నారు.అక్కడ డాక్యా ర్డు ఉద్యోగులు లేఅవుట్ వేసినప్పుడు పార్కు కోసం సర్వే నెంబరు 52/5-సీ లో 1,200 గజాల స్థలాన్ని జీవీఎంసీకి రిజిస్టర్ చేశారన్నారు.ఆ పార్కు స్థలం తో కలిపి ఎంపీకి జీవీఎంసీ ప్లాన్ మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్న పది ఎకరాల స్థలంలో 4ఎకరాల్లో పోలవరం కాలువ నిర్మాణం చేపట్టనున్నట్టు గతంలో వుడా మాస్టర్ప్లాన్లో పేర్కొన్నారన్నా రు. అయితే తాజా మాస్టర్ ప్లాన్లో పోలవరం కాలువ లేదని పేర్కొంటూ దానిని తప్పించడానికి ఎంపీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరో పించారు. ఇంకా అక్కడ 30 అడుగుల రోడ్డును, వెనుక రైవాడ కాలువను, మరోవైపు శ్మశాన స్థలాలను ఎంపీ ఆక్రమించుకున్నారని ఆరోపించారు.

# 2024లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగుర వేస్తాం



వైకాపా పాలనతో ప్రజలు విసిగిపోయారు
ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు
బద్వేలు మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు
గుర్రంపాటి వెంగలరెడ్డి



బద్వేలు 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయ కేతనం ఎగురవేయడం ఖాయమని బద్వేలు మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి ధీమా వ్యక్తపరిచారు గతంలో జరిగిన ఎన్నికలు వేరు జరగబోయే ఎన్నికలు వేరు అని ఆయన తెలిపారు వైకాపా మూడున్నర సంవత్సరాల పాలనపై ప్రజలు అన్ని విధాలుగా విసుగెత్తి పోయారని ఆయన పేర్కొన్నారు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలనుముఖ్యమంత్రి అన్ని విధాల బురిడి కొట్టించినట్లు వెంగళ్రెడ్డి ఆరోపించారు సంక్షేమ పథకాలు కేవలం కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి తప్ప అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందడంలేదని ఆయన ఆరోపించారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లు మూసి వేయించి పేదల ఉసురు పోసుకున్నట్లు ఆరోపించారు నిరుద్యోగులకు బృతి విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి గండి కొట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేదని చెప్పారు కుల మతాలకతీతంగా ప్రతి పండగకు ఉచితంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే విషయాన్ని ఆయన గుర్తు చేశారు గత మూడేళ్లలో ఏ ఒక్కరికి ఈ పథకాలు ఎత్తివేసిన ఘనత కూడా జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు రైతులను జగన్ ప్రభుత్వం అన్ని విధాల మోసం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తామని జగన్మోహన్ రెడ్డి పదే పదే చెప్పడం రైతుల ఆగ్రహానికి కారణమైందన్నారు పేరుకే రైతుల సంక్షేమం అని చెబుతున్న ముఖ్యమంత్రి రైతులపై ఏమాత్రం శ్రద్ధ కన పరచడం లేదని అరోపించారు తెలుగుదేశం పార్టీ హయాములో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉండే వారిని కక్షలు కార్పన్యాలు ప్రజల మధ్య ఉండేవి కావన్నారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతిపక్ష నేతలపై అనేక కేసులు బనాయించి వారిని జైలు పాలు చేయడమే గాక మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు రాష్ట్రంలో చదువుకుంటున్న బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు కళాశాలలకు వెళ్లిన బాలికలు నడిరోడ్డుపై దారుణ హత్యలకు గురవుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్రంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఆయన ఉదాహరించారు నేరాలు అరికట్టే విషయంలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు వెంగళ్రెడ్డి ఆరోపించారు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ విషయాన్ని పూర్తిగా మర్చిపోయినట్లు ఆయన ఆరోపించారు అనేక విషయాలలో ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలనపై విసిగించింది ఉన్నారని తెలిపారు క్షేత్రస్థాయిలో తాము ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు ఈ విషయాలన్నీ బయటికి వచ్చినట్లు తెలిపారు ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ఓట్లు వారి చేతికి వస్తే వైకాపా పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నట్లు వెంగళరెడ్డి తెలిపారు బద్వేల్ మున్సిపాలిటీలోని 35 వార్డులలో తెలుగుదేశం పార్టీ ఎంతో బలంగా ఉందని పేర్కొన్నారు అన్ని వార్డులలో పార్టీ నాయకులు క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి మనోభావాలు తెలుసుకున్నట్లు తెలిపారు బద్వేలు మున్సిపాలిటీలో దాదాపు 53 వేల మంది ఓటర్లు ఉన్నారు 64 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి ఓటర్లలో దాదాపు 70 శాతం మంది తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు ఒక విధంగా చూసుకుంటే బద్వేల్ పట్టణం మొదటినుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది కొన్ని తప్పిదాల వల్ల ఓటర్లు తెలుగుదేశం పార్టీపై అభిమానం ఉన్నప్పటికీ అటు ఇటు వెళ్లారు కానీ ఇప్పుడు పట్టణంలో పూర్తిగా పూర్వ పరిస్థితులు తెలుగుదేశం పార్టీకి వచ్చాయి

# వాహనాదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

ఎస్ ఐ నరేంద్ర కుమార్ రెడ్డి
చలానా పెండింగులో ఉంటే ఆన్లైన్ లో గానీ, మీ - సేవ లో గానీ వెంటనే చెల్లించాలి



కౌతాళం :వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవనిపెండింగ్ ఉన్న చలనా లను కట్టి పోలీసు వారికి సహకరించాలని ఎస్సై నరేంద్రకుమార్ రెడ్డి సూచించారు. ఏరిగేరి సమీపంలో ఉరుకుంద క్రాస్ లో శనివారం వాహనాలను తనిఖీలు చేపట్టారు.వారు మాట్లాడుతూ జిల్లా అధికారులు ఎస్పీ సిద్దార్థ్ కౌశాల్ ఉత్తర్వులు మేరకు కౌతాళం, మండలాలలోని వాహనదారులకు పెండింగ్లో ఉన్న చలానాలను ఎప్పటికప్పుడు ఈ - చలాన్ యాప్ ద్వారా తనిఖీ చేసుకొని వెంటనే ఆన్లైన్ ద్వారా కానీ, మీసేవ యందు కానీ చెల్లించి తగిన రశీదు పొందవలెను. పోలీసులు వాహనాలు తనిఖీ చేసే సమయంలో చలానాలు పెండింగ్లో వుంటే వాహనాన్ని సీజ్ చేస్తాము అని వివరణ ఇచ్చారు. సీజ్ చేసిన వాహనాల యొక్క పెండింగ్ చలానా కట్టిన తరువాత వాహనాలను వారికి అప్పగించబడునని గుర్తించు కోవాలి.మార్గమధ్యం లో ఇలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మీ వాహనాల పైన ఉన్న పెండింగ్ చలానాలను వెంటనే చెల్లించి పోలీసువారికి సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కౌతాళం ఎస్ ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుమ్ము నుంచి ప్రజల ప్రాణాలను కాపాడండి

ప్రసాద్. పట్టణ సీపీఐ నాయకులు



నంద్యాల ఉదయం న్యూస్ :-నంద్యాల పట్టణ శివారు ప్రాంతాలైన ఎస్సార్ వి సి. నందమూరి నగర్. వైయస్సార్ నగర్. ప్రజలు దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారని వారిని కాపాడాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సహాయ కార్యదర్శి జి సోమన్న ఐయూఎంఎల్ అధ్యక్షులు అక్బర్ ఖాన్ ఏఐటియుసి పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు తదితరులు కోరారు . శనివారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ గతంలో కుందూ నది బ్రిడ్జి దగ్గర నుండి పెట్రోల్ బంక్ వరకు రహదారిలో గుంతలు పడ్డాయి గుంతలకు మట్టితో పూడ్చారు. మట్టి పై నీరు చల్లలేదు. రహదారిని నీటితో తడపకపోవడం వలన దుమ్ముతో ఆ ప్రాంతం అంతా దుమ్ము కప్పేసుకుని ఉంటుందన్నారు. ఆ ప్రాంతంలో ప్రయాణం చేసే వాహనదారులు పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కుందూ నదిపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన ఇరువైపులా పూర్తి చేస్తానని 20 రోజుల క్రితం ఎమ్మెల్యే మీడియా సోదరులతో ఆ ప్రాంతానికి వచ్చి త్వరలో పనులు ప్రారంభమవుతాయని పత్రికాముఖంగా చెప్పడం జరిగిందన్నారు. ఇంతవరకు అక్కడ పనులు మొదలు పెట్టలేదని తెలిపారు . నందమూరి నగర్ వైయస్సార్ నగర్ లో సీసీ రోడ్లు డ్రైనేజీలు శాంక్షన్ అయినవి అని ఒకటి రెండు రోజులు తూతూ మంత్రంగా పనులు మొదలుపెట్టి మరలా నిలుపుదల చేయడం జరిగిందని తెలిపారు. అధికారులు ఆ ప్రాంతంలోని పనులు చేయాలంటేనే ముందుకు రావడం లేదు. ఆ ప్రాంతంలోని ప్రజలతో ఆస్తి పన్ను నీటి పన్ను చెత్త పన్ను కరెంటు బిల్లులు ఇలా అనేక రకాల పన్నులు కట్టించుకోవడం తెలుసు కానీ ప్రజల సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచన కూడా లేదని ఎద్దేవా చేశారు.

## దేశం కోసం త్యాగం చేసిన, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ

చెన్నూరు నవంబర్ .19 భారతదేశం కొరకు తన ప్రాణాలను పణంగా పెట్టిన ఉక్కు మహిళ గా పేరుగాంచిన ఏకైక మహిళ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అని కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా మహేశ్వరి అన్నారు, చెన్నూరు నందుశనివారం 55 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించ బడినది,ఈ సందర్భంగా భారత దేశపు ఏకైక మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి ని పురస్కరించుకొని ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొండపేట కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఉమా మహేశ్వరి ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి ఘనంగా నివాళి అర్పించారు

# డబ్బింగ్ కష్టం అయ్యింది.. షూటింగ్ అవసరమా సామ్?



సమంత మయో సైటిస్ అనే దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న విషయం తెల్సిందే. ఆమె అనారోగ్యం కారణంగా గత కొన్నాళ్లుగా పూర్తిగా షూటింగ్ కు దూరం అయ్యింది. అంతకు ముందే షూటింగ్ పూర్తి అయిన యశోద సినిమా కోసం డాక్టర్ ను పక్కన పెట్టుకుని డబ్బింగ్ చెప్పిన విషయం తెల్సిందే.తమిళం మరియు తెలుగు భాషల్లో సమంత డబ్బింగ్ చెప్పింది.. ఆ డబ్బింగ్ చెప్పడం కోసం సమంత చాలా కష్టపడిందని.. ఆమె తీవ్రమైన ఒత్తిడికి గురి అవ్వడంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలు రావడంతో పక్కన ఉన్న డాక్టర్ ఆమెకు చికిత్స అందించాడు అంటూ సినిమా ప్రమోషన్ సందర్భంగా నిర్మాతలు చెప్పుకొచ్చారు.డబ్బింగ్ చెప్పడానికే చాలా కష్టపడ్డ సమంత త్వరలో షూటింగ్ కు జాయిన్ అవ్వబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం విజయ్ దేవరకొండ హీరోగా శివ నిర్వాన దర్శకత్వంలో రూపొందుతున్న ఖుషి సినిమా యొక్క షూటింగ్ కార్యక్రమాలకు సమంత హాజరు అయ్యేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి.సమంత వల్ల ఇప్పటికే చాలా ఆలస్యం అయిన ఖుషి సినిమాను వచ్చే ఏడాది సమ్మర్ లో అయినా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారట. అందుకే సినిమా షూటింగ్ ను పూర్తి చేయడం తన బాధ్యతగా భావించి సమంత ఇంకా పూర్తిగా కోలుకోకుండానే షూటింగ్ లో హాజరు అయ్యేందుకు ఓకే చెప్పిందట. డబ్బింగ్ కష్టంగా చెప్పిన సామ్ షూటింగ్ కు వెళ్లడం అవసరమా అన్నట్లుగా కొందరు ప్రశ్నిస్తున్నారు.సమంత కు ఒక వైపు చికిత్స అందిస్తూనే మరో వైపు షూటింగ్ లో పాల్గొనే విధంగా ప్లాన్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ఖుషి సినిమా కచ్చితంగా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందనే నమ్మకంతో విజయ్ తో పాటు సమంత ఫ్యాన్స్ ఉన్నారు.

# జాన్వీ కపూర్ చెన్నై హోం టూర్




హీరోయిన్ గా తెలుగు.. తమిళంతో పాటు బాలీవుడ్ లో కూడా వెలుగు వెలిగిన అతిలోక సుందరి శ్రీదేవి లేని లోటును ఆమె కూతురు జాన్వీ కపూర్ తీర్చేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తోంది. హీరోయిన్ గా జాన్వీ కపూర్ సాధ్యం అయినంత వరకు ఎక్కువగా సినిమాలు చేసేందుకు కమిట్ అవుతోంది. ఇప్పటి వరకు ఒక భారీ హిట్ అనేది ఈమెకు దక్కలేదు. అయినా కూడా ప్రయత్నాలు కంటిన్యూ చేస్తోంది.సినిమాలతో దక్కని గుర్తింపును సోషల్ మీడియా ద్వారా దక్కించుకుంది. ఇప్పటికే ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతు ఉన్నారు. ఈమె యొక్క సోషల్ మీడియా అకౌంట్ ను ఫాలో అవ్వడంతో పాటు.. ఈమె ఫోటోలు ఎక్కడ వచ్చినా కూడా అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు.తాజాగా మరోసారి జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో సందడి చేసింది. ఈ సారి జాన్వీ కపూర్ యూట్యూబ్ లో తన చెన్నై లోని ఇంటిని చూపించి వార్తల్లో నిలిచింది. తన తల్లితో పాటు తండ్రి తో అక్కడ కలిసి ఉన్నాను అంటూ పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంది.చెన్నై లోని అద్భుతమైన ఇంటిని జాన్వీ కపూర్ ప్రముఖ మ్యాగజైన్ వోగ్ కోసం చూపించింది. వోగ్ యూట్యూబ్ ఛానల్ లో ఈ వీడియోను పోస్ట్ చేయడం జరిగింది. శ్రీదేవి ఉన్నటి నుండి ఇప్పటి వరకు ఆ ఇంటిని జాన్వీ కపూర్ మరియు బోనీ కపూర్ జాగ్రత్తగా చూసుకుంటూ ఉన్నారట.జాన్వీ చూపించిన శ్రీదేవి ఇల్లు ప్రస్తుతం వైరల్ అవుతోంది. తక్కువ సమయంలోనే మిలియన్ వ్యూస్ కు ఈ వీడియో చేరువ అయ్యింది. వేలల్లో లైక్స్ మరియు షేర్ ను కూడా ఈ వీడియో దక్కించుకుంటుంది. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ఇటీవలే మిలీ అనే సినిమా తో వచ్చింది. త్వరలోనే మరో కొత్త సినిమాను ఈమె విడుదల చేయబోతుందట.

# ఎన్టీఆర్ - యష్ కంటే చరణ్ కాస్త ముందున్నాడు..!

ఏ హీరో అయినా సక్సెస్ వచ్చిన వెంటనే దాన్ని కంటిన్యూ చేసేలా మార్కెట్ ని విస్తరించుకునేలా పర్ఫెక్ట్ ప్లాన్ తో ముందుకు వెళ్లాలని అనుకుంటాడు. అదే పాన్ ఇండియా స్థాయిలో ఇమేజ్ వస్తే.. దాన్ని కాపాడుకునే విధంగా ప్రాజెక్ట్స్ ని సెట్ చేసుకుంటారు. కానీ ఇప్పుడు నేషనల్ వైడ్ క్రేజ్ సంపాదించుకున్న



ఇద్దరు సౌత్ స్టార్ హీరోలు ప్రస్తుతం ఖాళీగా ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వారెవరో కాదు ఎన్టీఆర్ మరియు యష్.టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ మరియు శాండల్ వుడ్ రాకింగ్ స్టార్ యష్ ఇద్దరూ ఇప్పుడు యాదృచ్ఛికంగా ఒకే దారిలో ప్రయాణిస్తున్నారు. బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ అందుకొని పాన్ ఇండియా స్టార్స్ గా మారినప్పటికీ.. ఇంతవరకూ తమ తదుపరి చిత్రాలను సెట్స్ మీదకు తీసుకెళ్లలేకపోయారు. నెలలు గడుస్తున్నా వారి నెక్స్ట్ ప్రాజెక్ట్స్ ఇంకా ప్రీ ప్రొడక్షన్ దశలోనే ఉండటం గమనార్హం. తారక్ విషయంలో ఓదార్పు ఏమిటంటే.. అతని సినిమా ఇప్పటికే ప్రకటించబడింది.ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కినచిత్రంతో ఎన్టీఆర్ ఘన విజయాన్ని సాధించడమే కాదు.. అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకున్నాడు. దీంతో అగ్ర హీరో నెక్స్ట్ మూవీ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో ఔఖీ30 సినిమా చేయనున్నట్లు అధికారిక ప్రకటన ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఈ సినిమా ఆలస్యం అవుతూనే ఉంది.ఈ నేపథ్యంలో ఔఖీ30 పై రోజుకో రూమర్ వస్తూనే ఉంది. అయితే ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. తారక్ - కొరటాల సినిమా త్వరలో సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉందని నివేదికలు ఉన్నాయి. కొత్త సంవత్సరంలో ప్రారంభిస్తారని కూడా వార్తలు వస్తున్నాయి. అయితే షూటింగ్ ఎప్పటి నుంచి మొదలవుతుందనే విషయం మీద ఇప్పటి వరకు క్లారిటీ లేదు.మరోవైపు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన ఐఉఈ-2 సినిమాతో పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ అందుకున్నాడు యష్. అయితే ఇంతవరకూ తన కొత్త సినిమా జజీబష్ట19 గురించి ఏమీ ప్రకటించలేదు. 'ముఫ్తీ' ఫేమ్ నర్తన్ సినిమాతో సహా పలు ప్రాజెక్టులను పరిశీలిస్తున్నాడు కానీ.. ఇంకా ఏదీ ఖరారు కాలేదు. అతను ఐఉఈ కు తగ్గట్లుగా ఎలాంటి సినిమాకి సంతకం చేయాలనే విషయంలో అయోమయంలో ఉన్నాడని.. చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది.టీవల 'జాన్ విక్ 2' వంటి పలు ఆంగ్ల చిత్రాలకు పని చేసిన హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ జె.జె. పెర్రీ పర్య వేక్షణలో యష్ గన్ షూటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. సినిమాలో యాక్షన్ సీన్స్ కోసమే కన్నడ హీరో సాధన చేస్తున్నారని అందరూ అనుకున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో అనేక రూమర్స్ వచ్చాయి. దీపావళికి అనౌన్స్ మెంట్ వస్తుందని అన్నారు. కానీ జరగలేదు. అసలు దీనిపై ఎవరికీ క్లారిటీ లేదు.ఇలా ఇద్దరు దక్షిణాది స్టార్ హీరోలు ప్రస్తుతం షూటింగ్స్ లేకుండా ఖాళీగానే ఉంటున్నారు. దీంతో వారి అభిమానులు నిరాశ చెందడమే కాదు.. నిరుత్సాహానికి గురవు తున్నారు. కానీ ఈ విషయంలో ఎన్టీఆర్ - యష్ ల కంటే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ముం దున్నాడని చెప్పాలి. చిత్రంతో పాన్ ఇండియా క్రేజ్ వచ్చిన తర్వాత షో మ్యాన్ శంకర్ దర్శక్త్వంలో ఖీఅ15 వంటి భారీ సినివ ూ చేస్తున్నారు.నిజానికి జక్కన్న సినిమా చివరి దశలో ఉన్న పుడే చరణ్ తన నెక్స్ట్ ప్రా జెక్ట్ ని సెట్ చేసుకున్నారు.

# సాగర తీరంలో దూసుకెళ్తున్న రేసింగ్ కార్లు..



హైదరాబాద్: రేసింగ్ అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న ఇండియన్ రేసింగ్ లీగ్ హైదరాబాద్ వేదికగా ప్రారంభమైంది. నెక్లెస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన 2.7 కిలోమీటర్ల ప్రత్యేక ట్రాక్‌లో ఈ పోటీలు సాగుతున్నాయి.ఈ రేసింగ్ లో 12 కార్లు, 6 బృందాలు, 50 శాతం దేశంలోని రేసర్లు.. మరో 50 శాతం విదేశీ రేసర్లు సత్తా చాటుతున్నారు. ఇక ఈ పోటీలను 7500 మంది వరకు వీక్షించేందుకు ప్రేక్షకుల కోసం ట్రాక్ మార్గంలో 7 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఇక ఆదివారం కూడా ఈ పోటీలు కొనసాగనున్నాయి. కాగా భారత్‌తో ఇదే తొలి స్ట్రీట్ సర్క్యూట్ రేస్ కావడం గమనార్హం.శనివారం రేసింగ్ షెడ్యూల్:మధ్యాహ్నం: 3.10-3.20 వరకు క్వాలిఫయింగ్ 1మధ్యాహ్నం: 3.30-3.40 వరకు క్వాలిఫయింగ్ 2సాయంత్రం: 4.00-4.45 వరకు రేస్-1సాయంత్రం: 4.45-5.00 వరకు ఇంటర్వ్యూలు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**